# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ రోజు నుంచి "పల్లె పండుగ" వారోత్సవాలను రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తుంది.**

**2.** **క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు, శారీరిక ధృఢత్వం అలవడతాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో కీలక ఘట్టమైన తొలేళ్ల సంబరం ఈ రోజు జరగనుంది.**

**4.** **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు 'అలయ్ బలయ్' కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి తెలిపారు.**

**5.** **బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఈరోజు నుంచి రెండు రోజులపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**

==========================

గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ రోజు నుంచి "పల్లె పండుగ" వారోత్సవాలను రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తుంది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 13 వేల 324 గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగనుంది. కృష్ణా జిల్లా కంకిపాడులో నిర్వహించే పల్లె పండుగ వారోత్సవ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ పాల్గొంటారు. మిగిలిన అన్ని శాసనసభ నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో మంత్రులు, శాసనసభసభ్యులు పాల్గొననున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ వి.ఆర్.కృష్ణతేజ తెలుపుతూ..

..వాయిస్.... 30 సెకన్లు

---------------------------

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక ధృఢత్వం అలవడతాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక క్రీడా మైదానంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర స్థాయి పోటీలను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి రామ్మోహన్ నాయుడు నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, క్రీడల ద్వారా దేశ కీర్తి, ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసే శక్తి క్రీడాకారులకే

ఉందన్నారు. తల్లిదండ్రులు  పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని కేంద్ర మంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం ఈ రోజు  లాటరీ ప్రక్రియను నిర్వహిస్తారు. 26 జిల్లాల పరిధిలో ఉదయం 8 గంటల నుంచే కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ప్రారంభిస్తారు. జిల్లా గెజిట్‌లో ప్రచురించిన దుకాణాల క్రమసంఖ్య ప్రకారం లాటరీ తీస్తారు. ఈ ప్రక్రియంతా దరఖాస్తుదారుల సమక్షంలోనే జరుగుతుంది. తర్వాత వరుస క్రమంలో అన్ని దుకాణాలకు లాటరీ తీస్తారు. అన్ని జిల్లాల్లో ఇందుకు సంబందించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తిచేశారు. మొత్తం 3 వేల 396 మద్యం దుకాణాలకు రాష్ట్రవ్యాప్తంగా 89 వేల 882 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంలో ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి పండగకు సర్వం సిద్ధమైంది. ఉత్సవాల్లో కీలక ఘట్టమైన తొలేళ్ల సంబరం ఈ రోజు  జరగనుంది. ఈ ఉత్సవ ఏర్పాట్లపై పై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి విజయనగరం జిల్లా ప్రతినిధి కె.ఎన్ రామకృష్ణ అందజేస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

ఇది ఇలా ఉండగా విజయనగరంలో విజయనగరం ఉత్సవాలు నిన్న  ప్రారంభమైయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి భారీ ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు.

---------------------------

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అలయ్ బలయ్ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో  హర్యాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి  మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు అతిపెద్ద పండగ దసరా అని,. రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. తెలంగాణ సంస్కృతిని నలుదిశలా వ్యాపింపచేయడమే  'అలయ్ బలయ్' ముఖ్య ఉద్దేశమని రేవంత్‌రెడ్డి తెలిపారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఈరోజు నుంచి రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.  కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 35 కి.మీ నుండి 55 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని. ఈ నేపథ్యంలో  మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు నుంచి రానున్న రెండు  రోజులు పాటు  తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది .

ఇది ఇలావుండగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. పునరావాస ఏర్పాట్లు సిద్ధం చేయాలని, ప్రభుత్వ అధికారులు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో వుండాలని ఆదేశాలు జారీ చేసింది.

అత్యవసర సహాయక చర్యల కోసం టోల్ ఫ్రీ నంబర్లు 1070, 112, 1800-425-0101ను సంప్రదించాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాగులు, కాలువలు, రహదారులు, కల్వర్టులకు దూరంగా ఉండాలని పేర్కొంది.

---------------------------

తెలంగాణలో దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను రూపొందించింది. ఈ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్న దివ్యాంగులకు.. వారి విద్యార్హతలను బట్టి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనుంది. యూత్ ఫర్ జాబ్స్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి పోర్టల్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఈ పోర్టల్‌ను తెలంగాణ శిశు, సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఈ రోజు ఆవిష్కరించనున్నారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో దసరా రద్దీ కొనసాగుతోంది. శనివారం నుంచి భవానీ దీక్షదారుల రద్దీ పెరిగింది. ఆర్టీసీ బస్సులు, రైళ్లు, సొంత వాహనాలతో పాటు కాలినడకన వేలాదిగా భవానీ భక్తులు కనకదుర్గమ్మ ఆలయానికి చేరుకుంటున్నారు. దీంతో విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి కాళేశ్వరరావుమార్కెట్ పైవంతెన మీదుగా కెనాల్ బ్రిడ్జి మార్గంలో భవానీల సంఖ్య అధికంగా ఉండడంతో వాహనాల రాకపోకలను నియంత్రించారు. భవానీ భక్తులను క్రమపద్ధతిలో పంపిస్తున్నారు. అక్కడి నుంచి రద్దీని పరిగణనలోకి తీసుకుని వినాయకుగుడిని ఆనుకుని ఉన్న మార్గంలోకి వెళ్లేలా చూస్తున్నారు. సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

---------------------------

తెలంగాణలోని వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండంలో భారత నౌకాదళ రాడార్ ప్రాజెక్టుకు రేపు రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రక్షణశాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో హెలికాప్టర్‌ను ల్యాండ్ చేయించి రోడ్డు మార్గాన సభా స్థలికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఇప్పటికే టేటకుల బీట్ తండా సమీపంలో పైలాన్ ఏర్పాటు చేశామని తెలిపారు. రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం 2 వేల 9 వందల ఎకరాలను తెలంగాణ అటవీ శాఖ భారత నౌకాదళానికి కేటాయించింది.

---------------------------

మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 17న అన్ని జిల్లాల్లో వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాలో రాష్ట్రస్థాయి వేడుక నిర్వహించనున్నారు. ప్రభుత్వం తరఫున ఇక్కడ ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొననున్నారని అధికారులు తెలిపారు..

-----------------------------

తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ సహా, ఇతర నియామకాలను రాజ్యాంగ నిబంధనలను అనుసరించి చేపట్టామని ఆ రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో ఎక్కడా ఉల్లంఘనలు జరగలేదన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మండలి ఛైర్మన్, సభాపతి నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. సంప్రదాయం ప్రకారమే ప్రతిపక్ష సభ్యుడికి పీఏసీ ఛైర్మన్ పదవి ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.

=======================